

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : మంగళవారం సా : 6.36 గం.
సహర్ : బుధవారం ఉ : 4.40 గం.

నవవసంత శోభ

నేడు క్రోధినామ ఉగాది పర్వదినం

భవిష్యత్‌పై కోటిఆశలను కలిగిస్తూ జీవనగమనంలోని ఎత్తుపల్లాలను గుర్తు చేస్తూ ఇంటిల్లిపాదికి ఇంపైన పండుగగా నిలిచేది ఉగాది.. కోకిలమ్మ కుహు కుహు రాగాలు.. వసంతుని వలపు గీతాలు, మామిడాకుల మంగళ నాదాలు, వేపపూల వగరుభాష్యాలు వెరసి ఉగాది. చాంద్రమాన సాంప్రదాయంలో సంవత్సరంలోని పన్నెండు నెలలలోని మొదటిరోజైన చైత్ర శుద్ధపాడ్యమిగా వచ్చేది ఉగాది. ఈ క్రమంలో నేడు క్రోధి నామ ఉగాది సంవత్సరంగా జరుపుకోనున్నారు. ఉగాదిని అన్ని శుభకార్యాలకు నాందిగా భావిస్తారు. ఇంటిల్లిపాది ఇష్టదైవాన్ని పూజించి ఇంటి పెద్ద చేతుల మీదుగా ప్రసాదాన్ని, పచ్చడిని స్వీకరిస్తారు. భక్ష్యభోజ్యాదులను ఇంటిదైవానికి నైవేద్యంగా నివేదిస్తారు.

- సిద్దిపేటఅర్బన్/కొండపాక/చేర్యాల, ఏప్రిల్ 8



- ఇంటిల్లిపాదికి ఇంపైన పండుగ
- జీవితానుభవాల మిశ్రమ సూచికగా పచ్చడి
- పంచాగ శ్రవణంతో గంగాస్నాన ఫలితం







ఉగాది నాటి ప్రధానఘట్టం పంచాంగ శ్రవణం. దీనివల్ల పవిత్ర గంగాస్నాన ఫలం కలుగుతుందని ప్రతీతి. తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణం అనే ఐదు అంశాలకు సంబంధించిన వివరాలను తెలియజేసే పంచాంగాన్ని పూజిస్తారు. ఈ ఐదు మానవజీవనంపై చూపే ప్రభావాన్ని తెలుపుతూ ఇళ్లలో, గుళ్లలో, గ్రామకూడళ్లలో పంచాగనిపుణులు, సిద్ధాంతకర్తలు పంచాంగ శ్రవణం చేస్తారు. గ్రామ ప్రజలు ఒక చోట చేరి కొత్త సంవత్సరంలో పాడి పంటలు, వాతావరణ అనుకూలతలు, ఆదాయ, వ్యయాలు, గ్రహఫలాలు తెలుసుకుంటారు.

కవితలమ్మ కంఠాభరణం

కొత్త సంవత్సరం కొంగొత్త జీవనాన్ని అందించాలని ఆకాంక్షిస్తు కవులు, సాహితీవేత్తలు తమ కవితాఝురికి పదును పెడతారు. తరతరాల పీడిత జీవనానికి తెరపడాలని గొంతెత్తుతారు. కలంవాకిట పూసిన అక్షరసుమాలతో నూతన సంవత్సరాదికి అందమైన మాలలల్లుతారు. గడిచిన సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, కాలగర్భంలో పురుడు పోసుకున్న కొత్త ఉగాదికి పోటీలుపడి స్వాగతం పలుకుతారు.

ఉగాది పచ్చడి ప్రాముఖ్యత

ఉగాది మరో విశిష్టత పచ్చడి. జీవితంలో మంచిచెడులు, కష్టసుఖాలు అంతర్భాగమని వాటిని ధైర్యంగా స్వీకరించడం వలన మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఈ పచ్చడి అంతరార్థం. వేపపూలు, బెల్లం, వాము, కొత్త చింతపండు, లేత మామిడికాయలను ఉపయోగించి తయారుచేసే ఈమిశ్రమం శాస్త్రీయంగానే కాకుండా, ఆరోగ్యపరంగా కూడా విశిష్టతను కలిగి ఉంది. చేదు, తీపి, కారం, ఉప్పు, పులుపు, వగరు అనే ఆరురుచులను మిళితం చేసి పచ్చడిని తయారుచేస్తారు. ఈ ఆరు రుచులు విచారం, సంతోషం, కోపం, భయం, అయిష్టత, ఆశ్చర్యం అనే ఆరు మానసిక భావనలను సూచిస్తాయని పురాణోక్తి.

మామిడికాయలు, కుండలకు డిమాండ్

ఉగాది సందర్భంగా పట్టణాల్లోని మార్కెట్లు సందడి మారాయి. సిద్దిపేట చుట్టుపక్కల గ్రామాల ప్రజలు మామిడికాయలు, ఆకులు, చింతపండు, మోదుగు ఆకులు వేపపువ్వు తదితరాలను తీసుకొచ్చి పట్టణంలో విక్రయిస్తూ ఉంటారు. ఇక పచ్చడి తయారు చేయడానికి ఉపయోగించే కుండలకూ డిమాండ్ బాగా ఉంది. కుండల సైజును పట్టి 100 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నారు.

సమాజ అభ్యున్నతికి కరదీపిక పంచాంగం



ఈ యేడాది క్రోధినామ సంవత్సరంగా జరుపుకుంటున్నాం. జననకాలంలోని గ్రహస్థితి మానవజీవనంపై ఎంతో ప్రభావం చూపుతుంది. పంచాంగ పఠనం, శ్రవణం ద్వారా గంగా స్నాన ఫలం చేకూరుతుంది. ఐదు అంశాల గురించిన సవివర సమాచారాన్ని అందించే పంచాంగాన్ని అనుసరించడం వల్ల వ్యక్తుల్లో కాక వ్యవస్థలో కూడా గణనీయమైన సానుకూల మార్పు సాధించవచ్చు. సంస్కృతీ సాంప్రదాయాల పరిరక్షణలో పంచాంగం ప్రధాన పాత్ర పోషిస్తుంది.

- మర్మాముల రామచంద్రమూర్తి, పురోహితుడు





సిద్దిపేటలో కుండలు, మామిడికాయలు విక్రయిస్తున్న చిరువ్యాపారులు



నర్సాపూర్ సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

హామీలు అమలుచేయని

ప్రభుత్వంపై చీటింగ్ కేసు పెట్టాలి

- గ్యారంటీల పేరిట బాండ్‌పేపర్లు రాసిచ్చి మాట తప్పారు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

నర్సాపూర్, ఏప్రిల్ 8: అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఆరు గ్యారంటీలు అమలు చేస్తామంటూ బాండ్‌పేపర్లు కూడా రాసిచ్చారని, గడవు దాటినా వాటిని అమలు చేయనందుకు కాంగ్రెస్ ప్రభుత్వంపై చీటింగు కేసు పెట్టాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. నర్సాపూర్‌లో బీఆర్ఎస్ సన్నాహక సమావేశం సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఎమ్మెల్యే సునీతా రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామ్‌రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్‌లకు రాజకీయ ప్రయోజనాలు తప్ప ప్రజల గురించి పట్టింపు లేదని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధిని ఆకాంక్షించే పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలమైందని విమర్శించారు. అరచేతిలో వైకుంఠం చూపారే తప్ప చేసిందేమీ లేదన్నారు. కేవలం లీకు వార్తలు.. ఫేకు మాటలతో ప్రజలను పక్కదారిపట్టిస్తూ కాలం వెల్లదీస్తున్నారని మండిపడ్డారు. పార్లమెంటు ఎన్నికల ప్రచారానికి వచ్చే కాంగ్రెస్ నాయకులను హామీలపై నిలదీయాలని ప్రజలను కోరారు. తెలంగాణ ఉద్యమంలో ఏనాడూ పాల్గొనని రేవంత్‌రెడ్డి సీఎంగా ఇప్పటి వరకు అమరవీరులకు నివాళులర్పించలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామ్‌రెడ్డి ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే ఎన్నికల బరిలో దిగారని తెలిపారు. మెదక్ ఎంపీ స్థానం బీఆర్ఎస్‌కు కంచుకోట అని, ఇక్కడి నుంచి ఆయన గెలుపు ఖాయమని పేర్కొన్నారు. అనంతరం వెంట్రామ్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లాలో వివిధ హోదాల్లో పనిచేసిన తనకు ఇక్కడి ప్రజలతో ప్రత్యేకమైన అనుబంధం ఉందని పేర్కొన్నారు. తనను గెలిపిస్తే రూ. 100 కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేసి సేవ చేస్తానని తెలిపారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ కార్యకర్తల కృషితోనే తాను ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని, వారికి ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో దేవేందర్‌రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, చంద్రాగౌడ్, అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో అసంతృప్తి స్వరాలు

- సీఎం ఇష్టంతోనే మెదక్ ఎంపీ అభ్యర్థిత్వం
- మాటయినా చెప్పలేదని జిల్లా నేతల కినుక
- నరేంద్రనాథ్ పేరు ప్రతిపాదించిన పలువురు
- చేరికలపైనా డీసీసీలకు లేని సమాచారం



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఏప్రిల్ 8 : మెదక్ లోక్‌సభ అభ్యర్థి ఎంపికపై కాంగ్రెస్ నేతల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్నది. అభ్యర్థి ఎంపిక సమయంలో పలువురు నేతల పేర్లు చర్చకు వచ్చినా.. చివరకు పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇష్ట ప్రకారమే నిర్ణయం జరిగిందని తెలుస్తున్నది. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి దామోదర్ రాజనర్సింహకు మాత్రమే నీలం మధును మెదక్ అభ్యర్థిగా ఖరారు చేస్తున్నామని సీఎం చెప్పినట్లు తెలిసింది. ముఖ్యమంత్రే అలా చెప్పడంతో మంత్రి సరే అన్నట్టు సమాచారం. ఈ విషయం లో తమకు మాట మాత్రంగానైనా చెప్పలేదని పార్టీ ముఖ్య నేతలు కొందరు వాపోతున్నారు.

డీసీసీ నేతలకూ..

మెదక్ పార్లమెంట్ అభ్యర్థిగా నీలం మధును ఖరారు చేసే ముందు ఉమ్మడి మెదక్ జిల్లాలోని డీసీసీ నేతలకు పార్టీ నాయకత్వం నుంచి సమాచారమే లేదని పార్టీ వర్గాలంటున్నాయి. సిద్దిపేట, మెదక్, నర్సాపూర్ ప్రాంతాలకు చెందిన పార్టీ ముఖ్య నేతలు మెదక్ పార్లమెంట్ అభ్యర్థిగా సీ.నరేంద్రనాథ్ పేరు ను పరిశీలించాల్సిందిగా ముఖ్యమంత్రిని కోరారు. ప్రస్తుతం బీఆర్ఎస్‌లో ఉన్న నరేంద్రనాథ్‌కు టికెట్ ఇస్తామంటే పార్టీలో చేరతారని వారు వివరించారు. గతంలో రెండుసార్లు ఎంపీగా పోటీచేసి ఓడిపోయిన ఆయనపై ప్రజల్లో సానుభూతి ఉంటుందని, ఆర్థికంగానూ బలంగా ఉన్నారని, నియోజకవర్గంలో నరేంద్రనాథ్ సామాజిక వర్గమైన పద్మశాలీల ఓట్లు 2లక్షల వరకు ఉంటాయని వారు ముఖ్యమంత్రి వివరించినట్టు తెలిసింది. సంగారెడ్డి డీసీసీ నేతలు మాత్రం ఎవరి అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించలేదని సమాచారం. అందరి అభిప్రాయాలను తెలుసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి.. తాను అనుకున్నట్టే పటాన్‌చెరు మండలం చిట్కుల్ సర్పంచ్ నీలం మధు అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మరోవైపు, నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని పార్టీలో చేరడం ఖరారయింది. నాలుగైదు రోజుల్లో అనుచరులతో కలిసి ఆయన ముఖ్యమంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరనున్నారు. కానీ, ఈ విషయంపై ఇప్పటివరకు జిల్లా కాంగ్రెస్ ముఖ్య నేతలకు సమాచారమే లేదని పార్టీ వర్గాలు తెలిపాయి. పదేళ్లు ప్రతిపక్షంలో ఉండి పోరాడిన తమకు అధికారంలోకి వచ్చిన అనంతరం అధినాయకత్వం నుంచి కనీస గుర్తింపు లేకపోవడం బాధ కలిగిస్తున్నదని మెదక్ జిల్లా ముఖ్య నాయకుడొకరు వాపోయారు.

పటాన్‌చెరు నుంచే విభేదాలు?

పటాన్‌చెరు ప్రాంతానికి చెందిన నీలం మధుకు.. అక్కడి నుంచే పార్టీలో వ్యతిరేకత మొదలయింది. పటాన్‌చెరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న కాటా శ్రీనివాస్‌గౌడ్ వర్గం నీలం మధు ఎంపికను తప్పుపట్టారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి టికెట్ కోసం తనతో పోటీపడిన నీలం మధు.. అనంతరం బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేసి తన ఓటమికి కారకుడయ్యారని శ్రీనివాస్‌గౌడ్ పేర్కొంటున్నారు. ఇప్పుడు మళ్లీ ఆయనకు మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ టికెట్ ఇవ్వడమేమిటని ప్రశ్నించారు. నీలం మధు అభ్యర్థిత్వాన్ని సీఎం స్వయంగా ప్రతిపాదించి ఓకే చేయించడంతో కాటా వర్గం అసంతృప్తికి లోనయ్యింది. విషయం తెలుసుకున్న పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మంత్రి కొండా సురేఖ వారిద్దరితో చర్చించి సయోధ్య కుదిర్చారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ సతీమణి, డీసీసీ మహిళా విభాగం అధ్యక్షురాలు సుధారాణి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. చివరకు మంత్రి సురేఖ వారికీ సయోధ్య కుదర్చడంతో పటాన్‌చెరు నియోజకవర్గంలో మధు, శ్రీనివాస్‌గౌడ్ కలిసి తిరుగుతున్నారు. కాటా వర్గం నీలం మధుకు ఏమేరకు సహకరిస్తుందనే దానిపై పార్టీ వర్గాల్లోనే అనుమానాలున్నాయి. ఈ నేపథ్యంలో నాయకులందరినీ ఒక్కతాటిపైకి తీసుకురావడంపైనే మెదక్‌లో పార్టీ అభ్యర్థి విజయావకాశాలు ఆధారపడి ఉంటాయని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.



ఇఫ్తార్ విందులో మంత్రి

నారాయణఖేడ్‌లోని సాయిబాబా ఫంక్షన్‌హాల్‌లో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, జహీరాబాద్ మాజీ ఎంపీ, కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌కుమార్ షెట్కార్, ఎమ్మెల్యేలు సంజీవరెడ్డి, లక్ష్మీకాంతరావు, డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు.

-నారాయణఖేడ్

'కోడ్' ఉల్లఘించిన

అధ్యాపకుడిపై వేటు

సదాశివపేట, ఏప్రిల్ 8: ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన సదాశివపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు రవికుమార్‌పై సస్పెషన్ వేటు వేసినట్టు సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి సోమవారం ప్రకటనలో తెలిపారు. అధ్యాపకుడు రవికుమార్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నాడని అందిన ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారులు విచారణ జరిపారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్టు తేలడంలో తెలంగాణ సివిల్ సర్వీస్ రూల్స్ ప్రకారం సస్పెషన్ విధించినట్టు కలెక్టర్ వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల నిబంధనలకు లోబడి పనిచేయాలని ఆమె స్పష్టం చేశారు.

ముగిసిన కొమురవెల్లి జాతర



అగ్నిగుండాలను దాటుతున్న వీరశైవార్చకులు

చేర్యాల, ఏప్రిల్ 8 : ఓం వీరభద్ర శరభ.. శరభ.. ఓం రుద్రకాళి.. ఓం భద్రకాళి.. ఓం..ఓం..ఓం నమఃశ్శివాయ అని దేవతామూర్తులను స్తుతిస్తూ వీరశైవార్చకుల దండకాలు, వీరశైవపండితులు చేసిన మంత్రోచ్చారణలతో కొమురవెల్లి మారుమోగింది. కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల ముగింపులో భాగంగా సోమవారం తెల్లవారుజామున ఆలయ తోటబావి ప్రాంగణంలో వీరశైవసంప్రదాయం ప్రకారం అగ్నిగుండాలను అత్యంత భక్తిప్రపత్తులతో నిర్వహించారు. మల్లన్నను కీర్తిస్తూ అగ్నిగుండాలను దాటారు. గుండాలు దాటాం.. మా గండాలను ఎడబాపుమని వేడుకున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను

24 గంటల్లో ప్రారంభించాలి

- సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి ఆదేశం

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఏప్రిల్ 8 : జిల్లాలోని అన్ని మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను 24 గంటల్లో ప్రారంభించాలని సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి ఆదేశించారు. జిల్లాలోని రైస్ మిల్లర్లు, ఐకేపీ ఏపీవోలు, పీఏసీఎస్‌ల సీఈవోలు, రవాణా, వ్యవసాయశాఖ ఏఈవోలు, ఏవోలతో కలెక్టరేట్‌లో సోమవారం ఆమె సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ధాన్యం మద్దతుధర పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే 143 కేంద్రాలు ప్రారంభించామని, మిగిలిన కేంద్రాలను వెంటనే అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. రైతులు ఇబ్బందిపడకుండా ఏర్పాట్లు చేయాలని నిర్దేశించారు.

తాగునీరు, పారిశుధ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

కోహీర్, ఏప్రిల్ 8: గ్రామాల్లో తాగునీటి ఇబ్బంది తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. మండల కేంద్రమైన కోహీర్, నాగిరెడ్డిపల్లి, దిగ్వాల్ గ్రామాల్లో సోమవారం కలెక్టర్ పర్యటించారు. అయాచోట్ల మాట్లాడుతూ తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఉపాధి కూలీలు వడదెబ్బకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

- ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి భారతి హోలికేరి

మెదక్ అర్బన్, ఏప్రిల్ 8: వేసవి తీవ్రత దృష్ట్యా జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఉమ్మడి జిల్లా తాగునీటి పర్యవేక్షణ ప్రత్యేకాధికారి భారతి హోలికేరి ఆదేశించారు. మెదక్ జిల్లాలో సోమవారం ఆమె పర్యటించారు. అనంతరం నీటి ఎద్దడి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, నీటి సరఫరా తీరుపై కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి పూర్తయ్యేవరకు తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రక్కా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. రానున్న రెండు నెలల్లో నీటి సరఫరా అత్యంత కీలకమని పేర్కొన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని, ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం టీంవర్క్‌గా పనిచేయాలని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రమేష్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీపీవో యాదయ్య, అధికారులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి తాగునీరు

కౌడిపల్లి, ఏప్రిల్ 8: ప్రతీ ఇంటికి తాగునీరు సకాలంలో పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ప్రత్యేకాధికారి భారతి హోలికేరి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి సోమవారం ఆమె మండల పరిధిలోని మహ్మద్‌నగర్ పంచాయతీ పరిధిలోని కన్నారంలో పర్యటించారు. ప్రజలతో మాట్లాడి తాగునీటి సరఫరా జరుగుతున్న తీరు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత ప్రతీ అధికారిపై ఉందని పేర్కొన్నారు. ఆమెవెంట ఎస్ఈ రఘువీర్, ఈఈలు సంపత్‌కుమార్, కమలాకర్, డీపీవో యాదయ్య, డీఎల్‌పీవో యాదయ్య, డీఈ కిషన్, ఎంపీడీవో కిషన్ తదితరులు పాల్గొన్నారు.



కన్నారంలో మహిళలతో మాట్లాడుతున్న భారతి హోలికెరి

అనుమతులు లేని నీటి ట్యాంకర్లపై
అధికారుల ఆకస్మిక దాడులు

● నాలుగు ట్యాంకర్ల సీజ్

కంది, ఏప్రిల్ 8 : కొన్ని నెలలుగా వ్యవసాయ భూముల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా నీటిని తోడి, భారీ ట్యాంకర్ల ద్వారా పరిశ్రమలకు తరలిస్తున్న అనుమతులు లేని నీటి ట్యాంకర్లపై సోమవారం రెవెన్యూ, భూగర్భజాలాల అధికారుల ఆకస్మిక దాడులు జరిపారు. కంది తహసీల్దార్ విజయలక్ష్మి ఆదేశాలతో ఆర్ఐ రంగయ్య, భూగర్భజాలాల అధికారులు సంతోష్‌కుమార్, ఎండీ వజీయుద్దీన్ సిబ్బందిలో కలసి మండల పరిధిలో నీటి ట్యాంకర్లపై కొరఢా ఝుళిపించారు. చేర్యాలలో రెండు, కాశీపూర్, ఇంద్రకరణ్‌లో ఒక్కోటిచొప్పున మొత్తం నాలుగు నీటి ట్యాంకర్లను సీజ్ చేశారు. ఆ ట్యాంకర్లను ఇంద్రకరణ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయలక్ష్మి మాట్లాడుతూ మండలంలో ఎవరైనా అక్రమంగా నీటి వ్యాపారం చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రైతులు భూగర్భజలాలను పంటలు పండించుకోవడానికి మాత్రమే వినయోగించుకోవాలని సూచించారు. వ్యవసాయ బోర్ల నుంచి నీటిని తోడి పరిశ్రమలకు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కోహీర్ పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

కోహీర్ ఏప్రిల్ 8 : కోహీర్ మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి లక్ష్మణాచారిని సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ వల్లూరు క్రాంతి సోమవారం సాయంత్రం ఆదేశాలు జారీచేశారు. సోమవారం మధ్యాహ్నం కోహీర్ గ్రామాన్ని సందర్శించిన కలెక్టర్ మండలంలో నెలకొన్న తాగునీటి ఎద్దడి, మురుగు కాలువల నిర్వహణ తదితర సమస్యలను గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. కోహీర్‌లోని డంపింగ్‌యార్డ్‌లో సరైన సెగ్రిగేషన్ లేకపోవడంతో పాటు రోడ్లపైన ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం పడి ఉండడం, వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడ పారవేసి తగలబెట్టడం, సరైన తాగునీరు అందించకపోవడం వంటి తదితర పనుల్లో నిర్లక్ష్యం వహించడం పట్ల పంచాయతీ కార్యదర్శి లక్ష్మణాచారిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి దారుణ హత్య



పోలీసు జాగిలంతో విచారణ చేస్తున్న పోలీసులు

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 8 : సంగారెడ్డి పట్టణంలో గుర్తు తెలియని వ్యక్తిని హత్య చేసిన సంఘటన సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోతిరెడ్డిపల్లిలోని ఎ1 చికెన్ సెంటర్ పక్కన 55 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సున్న గుర్తుతెలియని వ్యక్తిని తలపై రాయితో బలంగా కొట్టి చంపారు. హత్యకు గురైన వ్యక్తి సిమెంట్ రంగు ప్యాంటు, ముదురు ఎరుపు రంగుఫుల్ షర్ట్, లోపల నలుపు తెలుపు అడ్డం గీతలతో హాఫ్ స్వెటర్ ధరించి ఉన్నాడు. ఘటనా స్థలాన్ని సంగారెడ్డి రూరల్ సీఐ అశోక్‌కుమార్ సందర్శించారు. ఈ వ్యక్తిని ఎవరైనా గుర్తిస్తే సంగారెడ్డి డీఎస్పీ 8712656706, సంగారెడ్డి రూరల్ సీఐ 8712656719, ఎస్ఐ 8712656746 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సంగారెడ్డి రూరల్ ఎస్ఐ వినయ్ కుమార్ తెలిపారు.

సైబర్ నేరగాళ్ల వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

● టాస్కల పేరిట రూ. లక్షలు మోసం

పటాన్‌చెరు, ఏప్రిల్ 8 : టాస్కులు పూర్తిచేస్తే కమీషన్ ఇస్తామని ముగ్గురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు వల విసిరి రూ. లక్షలు దోచేసిన ఘటన సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం అమీన్‌పూర్ పట్టణ పరిధిలోని సాయి భగవాన్ కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు గత నెలలో పార్ట్‌టైంజాబ్ పేరిట ఆన్‌లైన్‌లో ఓ లింక్ వచ్చింది. టాస్కులు పూర్తిచేస్తే కమీషన్ ఇస్తామని నమ్మించారు. మొదట చిన్న మొత్తాలకు టాస్కులు ఇచ్చి పూర్తిచేస్తే కమీషన్‌ను అకౌంట్‌కు క్రెడిట్ చేశారు. అనంతరం టాస్కల పేరిట భారీ మొత్తాలకు ఎర వేశారు. దీంతో బాధితుడు పలు విడతలుగా రూ.11.10 లక్షలు పెట్టుబడిగా పెట్టాడు. టాస్కులు పూర్తిచేసిన అనంతరం తన డబ్బుతో పాటు కమీషన్ జమ చేయాలని కోరగా అటువైపు నుంచి స్పందన రాలేదు. దీంతో మోసయానని తెలుసుకుని పోలీసులను ఆశ్రయించాడు.

మరో కేసులో ఇదే రీతిలో కిష్టారెడ్డిపేటలో నివాసముండే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి టాస్కల పేరిట రూ.6.54 లక్షలు, అమీన్‌పూర్ నరేంద్రకాలనీకి చెందిన మరో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.1.17 లక్షలు పోగొట్టుకున్నారు. జరిగిన మోసంపై సైబర్‌క్రైం కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

పెట్టుబడి పేరిట మోసం

గుమ్మడిదల, ఏప్రిల్ 8 : పెట్టుబడి పేరిట డబ్బు ట్రాన్స్‌ఫర్ చేయించుకుని మోసం చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు గుమ్మడిదల ఎస్ఐ మహేశ్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం అన్నారం గ్రామానికి చెందిన నాగులపల్లి కృష్ణచైతన్య చదువు పూర్తిచేసి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు. గత నెల 28న ఆయనకు గుర్తుతెలియని వ్యక్తి నుంచి వాట్సాప్‌లో లింకు వచ్చింది. ఓపెన్ చేయగా కొంత డబ్బు పెట్టుబడి అధిక లాభాలు వస్తాయని నమ్మించారు. తొలుత రూ. 6వేలు పెట్టుబడి పెట్టగా లాభంతో సహా తిరిగి చెల్లించారు. దీంతో నమ్మకం కుదిరి రూ. 1.78 లక్షల వరకు పెట్టుబడి పెట్టాడు. ఆ తరువాత లాభం రాకపోగా పెట్టిన డబ్బు కూడా తిరిగి ఇవ్వలేదు. దీంతో బాధితుడు సైబర్ క్రైమ్ నంబర్‌కి ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. ఈమేరకు గుమ్మడిదల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

వంద శాతం ఓటింగ్ లక్ష్యం

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



ఓటరు చైతన్యరథాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, ఏప్రిల్ 8: పార్లమెంట్ ఎన్నికల్లో వంద శాతం ఓటింగ్ నమోదు కావడమే లక్ష్యంగా పనిచేయాలని మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు పిలుపునిచ్చారు. స్వీప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓటరు అవగాహన చైతన్యరథాన్ని కలెక్టరేట్‌లో సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ శాతంలో జిల్లాను రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలిపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

15లోపు పోస్టల్ బ్యాలెట్‌కు
దరఖాస్తు చేసుకోవాలి

● మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్ అర్బన్, ఏప్రిల్ 8 : ఎన్నికల విధులను నిర్వహించే ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర, అత్యవసర సిబ్బంది అంతా పోస్టల్ బ్యాలెట్ కోసం ఈనెల 15వ తేదీలోగా ఫారం-12 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నోడల్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే సెక్టారు అధికారులు, రవాణా సిబ్బంది, డ్రైవర్లు, వీడియోగ్రాఫర్లు తదితర సిబ్బందికి కూడా పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని కల్పించిందన్నారు. 33 అత్యవసర సేవల విభాగాల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఆర్డీవో(రిటర్నింగ్ అధికారి) కార్యాలయంలో మూడు రోజుల పాటు పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో నోడల్ అధికారులు శ్రీనివాస్‌రావు, రాజిరెడ్డి, గోవింద్, బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నాచగిరీశుడి రథోత్సవం

పురవీధుల్లో జయజయధ్వానాల మధ్యన ఊరేగిన లక్ష్మీనృసింహుడు

వర్గల్, ఏప్రిల్ 8 : నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో స్వామివారి నవాహ్నిక బ్రహోత్సవాల్లో ప్రధాన ఘట్టమైనా స్వామివారి విమాన రథోత్సవం సోమవారం కన్నులపండుగగా సాగింది. ఆదివారం అర్ధరాత్రి ఆలయ వేద పండితుల వేద మంత్రోచ్చారణల మధ్యన రథ ప్రతిష్ఠ, స్వామివారిని ఊరేగింపు నిర్వహించే విమాన రథానికి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం ఆలయ ఉత్తర ద్వారం ఎదుట సర్వాంగా సుందరంగా అలంకరింపజేసిన విమాన రథంపై లక్ష్మీసమేతనృసింహస్వామి వారిని గరుడ వాహనులైన దివ్య విమాన రథంపై అధిష్ఠింపజేశారు. అనంతరం మంగళ వాయిద్యాలు, మహిళల కోలాటం మధ్యన నాచగిరి పురవీధుల్లో ఊరేగించారు. ఉదయం 6.00 గంటలకు ప్రారంభమైన రథోత్సవం 9.00 గంటల వరకు సాగింది. రథోత్సవం అనంతరం ఆలయ యాగశాలలో మహా పూర్ణహుతి, చక్రవరి తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. రథోత్సవ కార్యక్రమాన్ని తిలకించడానికి భక్తులు వేలాది సంఖ్యలో క్షేత్రానికి తరలివచ్చారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు. వేడుకలకు పరిసర ప్రాంతాల భక్తులతో పాటు హైదరాబాద్, సికింద్రాబాద్, ఇతర జిల్లాల నుంచి వేల సంఖ్యలో తరలివచ్చారు. గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్ఐ శివకుమార్ పర్యవేక్షణలో పటిష్ఠవంతమైన బందోబస్తును నిర్వహించారు. రథోత్సవ కార్యక్రమానికి డీసీసీ ప్రెసిడెంట్, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, జడ్పీటీసీ బాలుయాదవ్, ఎంపీపీ జాలిగామ లతరమేశ్‌గౌడ్, ఆలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ కూచారం నర్సింలుగౌడ్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, మాజీ ఎంపీపీ మోహన్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పూదరి నందన్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు అట్ల సందీప్‌రెడ్డి, నాయకులు, పాల్గొన్నారు.







నాచగిరి పురవీధుల్లో స్వామివారి రథోత్సవానికి హాజరైన భక్తులు, కోలాటం ఆడుతున్న మహిళలు, విమాన రథంపై లక్ష్మీనృసింహస్వామి

గల్లీ నుంచి ఢిల్లీ దాకా కాంగ్రెస్ జెండా ఎగరాలి

● కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలం
● ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తాం
● కాంగ్రెస్‌తోనే సుస్థిర, సమర్థవంతమైన పాలన
● జహీరాబాద్ ఎంపీగా సురేష్‌షెట్కార్ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి
● రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



నారాయణఖేడ్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

నారాయణఖేడ్, ఏప్రిల్ 8 : గల్లీ నుంచి ఢిల్లీ దాకా ఎక్కడ ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ జెండా ఎగరాలని, పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పిలుపునిచ్చారు. సోమవారం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో ఏర్పాటు చేసిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలం అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తుందని పేర్కొన్నారు. ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే ఐదు గ్యారంటీలను అమలు చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ యువ నాయకుడు రాహుల్‌గాంధీ తుక్కుగూడా సభలో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ గ్యారంటీలను అమలు చేస్తామని ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో భ్రష్టు పట్టిచ్చిందని ధ్వజమెత్తారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచారన్నారు. బీఆర్ఎస్ విధానాలతో రాష్ట్ర ప్రజలపై ఆరు లక్షల కోట్ల అప్పుల భారం పడిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో సురేష్‌షెట్కార్ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని కోరారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ఖాయమైనప్పటికీ, కార్యకర్తలు అత్యుత్సాహానికి పోకుండా అప్రమత్తతతో పనిచేయాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయని మంత్రి తెలిపారు. ఇప్పటి వరకు కార్యకర్తలు తమ కోసం పని చేశారని, పార్లమెంట్ ఎన్నికల అనంతరం తాము కార్యకర్తల కోసం పని చేస్తామన్నారు. కార్యకర్తలు కూడా ఉన్నతస్థాయికి ఎదగాలని కోరుకున్నారు. త్వరలో 30వేల ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆశ వర్కర్ల వేతనాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. బీజేపీతో ఒరిగేదేమీలేదని, కాంగ్రెస్‌తోనే సుస్థిరమైన, సమర్థవంతమైన పాలన అందుతుందని దామోదర్ స్పష్టం చేశారు. జహీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి మాజీ ఎంపీ సురేష్ షెట్కార్ మాట్లాడుతూ పదేళ్ల ఎంపీగా ఉన్న బీబీ పాటిల్ తన వ్యాపారాలను అభివృద్ధి చేసుకున్నాడని విమర్శించారు. ఆయన బిజినెస్ పాటిల్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీలో ఉంటే మనుగడ ఉండదని, బీజేపీ నుంచి పోటీ చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో సురేష్ షెట్కార్‌ను గెలిపించాలని కోరారు. ఆయన ఎంపీగా గెలిచాక, ఇద్దరం కలిసి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు శ్రమిస్తామన్నారు. ఈ సమావేశంలో జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు, డీసీసీ ప్రెసిడెంట్ నిర్మలాజగ్గారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ప్రణాళిక మండలి మాజీ సభ్యులు నగేష్‌షెట్కార్, టీపీసీసీ సభ్యులు శ్రీనివాస్, శంకరయ్యస్వామి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్, జిల్లా కాంగ్రెస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, మాజీ జడ్పీ కోఆప్షన్ సభ్యులు రషీద్, సేవాలాల్ సంఘం రాష్ట్ర నాయకులు రమేష్‌చౌహాన్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు తాహేర్‌అలీ, నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు. మంత్రి దామోదర్‌ను కాంగ్రెస్ శ్రేణులు గజమాలతో సత్కరించారు.

రాష్ట్రంలో రైతుల పరిస్థితి అగమ్యగోచరం

● అమలు కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్
● ప్రభుత్వం మారిన అనంతరం కుంటుపడిన అభివద్ధి
● అసెంబ్లీ మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

కల్హేర్, ఏప్రిల్ 8 : నేడు రాష్ట్రంలో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారయిందని, సాగునీరు లేక పంటలు ఎండుతున్నా మంత్రులకు కానీ, ముఖ్యమంత్రికి కానీ పట్టడం లేదని అసెంబ్లీ మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ధ్వజమెత్తారు. కల్హేర్, పెద్దశంకరంపేట మండలాల బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం కల్హేర్ మండల పరిధిలోని మాసాన్‌పల్లిలో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి ఎలాగూ రాలేమని, కాంగ్రెస్ పార్టీ అమలు కాని హామీలు ఇచ్చిందని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చాక ఏం చేయాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారాక అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. ప్రభుత్వాన్ని సమర్థవంతంగా నిర్వహించలేక బీఆర్ఎస్ పార్టీపై లేనిపోని ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ఆరు గ్యారంటీలు అంటూ కాంగ్రెస్ పార్టీ ప్రజలు మోసంచేసిందన్నారు. రైతులను నట్టేటా ముంచిందని మండిపడ్డారు. నేటికీ అధిక శాతం రైతుల ఖాతాల్లో రైతుబంధు డబ్బు జమ కాలేదని గుర్తుచేశారు. ఇక రెండు లక్షల రుణమాఫీ చేస్తామని, దీనికి తన వద్ద ప్రత్యేక ప్లాన్ ఉందని గాంభీర్యం ప్రదర్శించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చి నాలుగు మాసాలు గడుస్తున్నా ఆ దిశగా చర్యలే తీసుకోలేదని ఆరోపించారు. జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ మాట్లాడుతూ తనను ఎంపీగా గెలిపిస్తే స్థానికులకే ఉద్యోగాలు కల్పించి, ప్రజలకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ అలీ, కల్హేర్, పెద్దశంకరపేట జడ్పీటీసీలు నర్సింహారెడ్డి, విజయరామరాజు, ఎంపీపీ జంగం శ్రీనివాస్, బీఆర్ఎస్ యువత విభాగం కల్హేర్ మండల అధ్యక్షుడు సంతోష్‌కుమార్, ఎంపీపీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ గని, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల రవాణాపై ఉక్కుపాదం

● వీడియో కాన్ఫరెన్స్‌లో ఐజీ ఏవీ రంగనాథ్

మెదక్ అర్బన్, ఏప్రిల్ 8: మత్తు పదార్థాల అక్రమ రవాణా, ఉత్పత్తి చేస్తున్న వారిపై ఉక్కుపాదం మోపాలని మల్టిజోన్-1 ఐజీ ఏవీ రంగనాథ్ ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి ఆయా జిల్లాల ఎస్పీలతో ఆయన వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ... దేశ భవిష్యత్తును నిర్ణయించే యువత గంజాయి, మత్తుపదార్థాల బారిన పడకుండా చూడాలన్నారు. గంజాయి రవాణాకు పాల్పడితే పీడీయాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. అక్రమ రవాణా, విక్రయాలు జరిగితే జిల్లా పోలీస్ వాట్సాప్ నెంబర్ 8712657888 కు సమాచారం అందించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఎస్పీ డా.బాలస్వామి, ఏఎస్పీ మహేందర్, మెదక్, తూప్రాన్ డీఎస్పీలు రాజేశ్వర్, వెంకటరెడ్డి, జిల్లాలోని సీఐ, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఐజీ రంగనాథ్

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

● మెదక్ ఎస్పీ బాలస్వామి

మెదక్ అర్బన్, ఏప్రిల్ 8 : పోలీసు ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మెదక్ ఎస్పీ బాలస్వామి సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాయలంలో ప్రజావాణి కార్యక్రమంలో బాగంగా ఆయన దరఖాస్తులను స్వీరించి ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి పలు ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ వెల్లడించారు.

బీఆర్ఎస్‌లో అంతా గందరగోళం

● పార్లమెంట్ ఎన్నికల వేళ హత్నూర మండల నేతల్లో అసంతృప్తిరాగం



మంగాపూర్‌లో రహస్య సమావేశం అనంతరం పార్టీ నేత బర్త్ డే వేడుకలలో నాయకులు(ఫైల్)

హత్నూర, ఏప్రిల్ 8 : పార్లమెంటు ఎన్నికల వేళ బీఆర్ఎస్‌లో గందరగోళం నెలకొన్నది. హత్నూర మండలంలో సన్నాహక సమావేశాల సమాచారం ఎవరికి తెలపడం లేదంటూ కొందరు నాయకులు అలకబూనగా, పార్టీలో మొదటి నుంచి పనిచేసిన తమని ఎవరూ పట్టించుకోవడం లేదంటూ మరికొందరు ఆవేదన వెళ్లగక్కుతున్నారు. అయితే మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలవడంతో పాటు ఆయన అనుచరులుగా పేరున్న కొందరు నాయకులు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతుంది. పార్టీ కార్యక్రమాల సమయంలో వారిని పరిగణనలోకి తీసుకోవడం లేదు. బీఆర్ఎస్‌ను వీడనప్పటికీ కొందరు పనిగట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాత్రింబవళ్లు కష్టపడి బీఆర్ఎస్ ఎమ్మెల్యే గెలుపు కోసం ఎంతో కృషి చేసిన తమను కావాలనే దూరం చేస్తున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండల అధ్యక్షుడిని కాదని ఎవరికి వారే లీడర్లుగా చలామణి అవుతున్నారని బాహాటంగానే ఆరోపిస్తున్నారు. రెండు రోజుల క్రితం మంగాపూర్‌లోని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడి నివాసంలో మదన్‌రెడ్డి వర్గంగా పేరు ఉన్న నాయకులను పిలువకుండానే రహస్య సమావేశం నిర్వహించి పార్టీ కార్యాచరణ రూపొందించుకున్నట్లు సమాచారం. ఇలాగే ఏకపక్ష నిర్ణయాలు జరిగితే మరికొంత మంది బీఆర్ఎస్‌ను వీడే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు ద్వారా తెలిసింది.

అవకాశవాద పార్టీలను ఓడించాలి

● సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి జహంగీర్

చేర్యాల, ఏప్రిల్ 8 : పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద, అవకాశవాద పార్టీలను ఓడించాలని, దేశశ్రేయస్సు, ప్రజా సమస్యల పరిష్కారానికి అనునిత్యం పోరాడే సీపీఎంను గెలిపించాలని సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి జహంగీర్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూళిమిట్ట మండలాల కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో నిరుద్యోగం, పేదరికం పెరిగిపోయిందన్నారు. బీజేపీది మతోన్మాదం అయితే, కాంగ్రెస్ అవకాశవాద రాజకీయాలు చేస్తూ ప్రజలను వంచిస్తుందన్నారు. ఇక బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో నియంతృత్వంగా వ్యవహరించి ప్రతిపక్షాలు, ప్రశ్నించే గొంతులను నొక్కేసిందన్నారు. పోరాటాల వారసత్వం కలిగిన సీపీఎం భువనగిరి స్థానంలో పోటీచేస్తుందన్నారు. తాను ప్రజా పోరాటాల నుంచి వచ్చిన వ్యక్తినని, ఆదరించి గెలిపించాలని కోరారు. సమావేశంలో సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, నాయకులు అడివయ్య, రాళ్లబండి శశిధర్, కాముని గోపాలస్వామి, శెట్టిపల్లి సత్తిరెడ్డి, నందబోయిన ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి జహంగీర్

సంగారెడ్డి, నారాయణరావుపేటలో కేంద్ర బలగాల కవాతు



నారాయణరావుపేటలో కవాతు చేస్తున్న పోలీసులు, కేంద్ర బలగాలు

సంగారెడ్డి క్రైం/నారాయణరావుపేట, ఏప్రిల్ 8 : ప్రజల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించి, శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణనే లక్ష్యంగా కేంద్ర సాయుధ బలగాలతో సంగారెడ్డి పట్టణం, సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండల కేంద్రంలో సోమవారం కేంద్రబలగాలు, పోలీసులు కవాతును నిర్వహించారు. సంగారెడ్డిలో పట్టణ సీఐ భాస్కర్, ఆర్ఐలు హస్మిరెడ్డి, రామారావు, సుదీర్‌కుమార్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కమాండర్స్ కవాతులో పాల్గొన్నారు. నారాయణరావుపేటలో సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను ఆధ్వర్యంలో కవాతు కొనసాగింది. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ గూడ అపూర్వ రెడ్డి, బెజ్జంకి ఎస్ఐ కృష్ణారెడ్డి, సీఐఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీళ్లు వస్తలేవు మేడం



నీళ్లు వస్తలేవని కలెక్టర్ క్రాంతి దృష్టికి తీసుకొస్తున్న నాగిరెడ్డిపల్లికి చెందిన రత్నమ్మ

కోహీర్, ఏప్రిల్ 8: తమ గ్రామానికి కేసీఆర్ నీళ్లు (మిషన్ భగీరథ) నీళ్లు రావడం లేదని, దీంతో తాము తాగునీటి కోసం ప్రతిరోజు ఇబ్బంది పడుతున్నామని సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బోపునారం రత్నమ్మ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లింది. సోమవారం నాగిరెడ్డిపల్లి గ్రామాన్ని పరిశీలించేందుకు వచ్చిన కలెక్టర్ వల్లూరు క్రాంతికి గ్రామంలో తాగునీటి సమస్య ఉన్నదని పలువురు గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన రత్నమ్మ తమ గ్రామానికి కేసీఆర్ నీళ్లు రావడం లేదని, కరెంటు ఉంటే బోరు నీళ్లు కొన్ని వస్తున్నాయే తప్ప కరెంటు పోతే అసలు రావడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చింది. దీంతో కలెక్టర్ వెంటనే మిషన్ భగీరథ అధికారులకు తాగునీటి సమస్య రాకుండా చూడాలని ఆదేశించింది. ఈ కార్యక్రమంలో ఏపీడీ జంగారెడ్డి జహీరాబాద్ ఆర్డీవో రాజు, వివిధ ప్రభుత్వ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మీలో ఒక్కడిగా ఉంటా.. పార్లమెంట్‌లో మీ గొంతుకనవుతా

- బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి



సంగారెడ్డి మండలం కులబ్‌గూర్‌లోని సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 8: మీలో ఒక్కడిగా ఉంటూ సేవలందిస్తానని బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి అన్నారు. సంగారెడ్డి మండలం కులబ్‌గూర్‌లోని బదర్ ఫంక్షన్‌హాలులో సోమవారం నిర్వహించిన మెదక్ పార్లమెంట్ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి మెదక్ జిల్లాతో తనకు విడదీయలేని బంధం ఉన్నదని, జాయింట్ కలెక్టర్‌గా, కలెక్టర్‌గా ఇక్కడ సేవలందించిన తాను ప్రజాసేవ చేయాలనే సంకల్పంతో మాజీ సీఎం కేసీఆర్ ఎమ్మెల్సీగా అవకాశమిచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం అధికారంలో లేకపోయినా ఉమ్మడి మెదక్ జిల్లాకు న్యాయం జరగాలంటే విద్యావంతుడినైన, కలెక్టర్‌గా సేవలందించిన తనకు ఎంపీగా మరోసారి కేసీఆర్ అవకాశమిచ్చారని తెలిపారు. తనకు ఓట్లు వేసి గెలిపిస్తే పార్లమెంట్‌లో మీ గొంతుకనై ప్రజా సమస్యలపై గళం విప్పుతానని చెప్పారు. ట్రస్టు ఏర్పాటు చేసి ప్రతి కుటుంబం లబ్ధి పొందేలా సేవా కార్యక్రమాలు చేస్తానని హామీఇచ్చారు. సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ తప్పుడు వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ఏమి చేయాలో అర్థం కావడం లేదని, అందుకే ప్రజలకు ఇచ్చిన హామీలను వందరోజులు పూర్తయినా అమలు చేయకుండా విఫలమైందని విమర్శించారు. అనంతరం బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ మాట్లాడారు. సమావేశంలో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ వైస్ చైర్మన్ మాణిక్యం పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో కరెంటు కష్టాలు

సదాశివపేట, ఏప్రిల్ 8: ప్రజాసేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని, ఒక్క అవకాశం ఇస్తే రూ.100కోట్లతో పీవీఆర్ ట్రస్ట్ ఏర్పాటు చేసి ప్రజాసేవ చేసి తరిస్తానని బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి అన్నారు. సోమవారం సదాశివపేట పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ మండల కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. గడిచిన తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణలో కరెంటు కష్టాలు లేవన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కరెంటు కష్టాలు మొదలయ్యాయన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతుబంధు, పింఛన్లు, రుణమాఫీ వంటి పేద ప్రజల, రైతుల సంక్షేమానికి సంబంధించిన ఏ ఒక్క పథకం సక్రమంగా అమలు కావడం లేదన్నారు. అనంతరం ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ సదాశివపేట బీఆర్ఎస్ ఇలాఖా అన్నారు. వెంకట్రామారెడ్డిని ఎంపీగా గెలిపిస్తే మరో 50ఏళ్లు గుర్తుండేలా పనులు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెద్దగొల్ల ఆంజనేయులు, బీఆర్ఎస్ రాష్ట్ర నేతలు ఎర్రోళ్ల శ్రీనివాస్, పట్నం మాణిక్యం, రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, కాసాల బుచ్చిరెడ్డి, నాగేష్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

హవేళిఘణపూర్, ఏప్రిల్ 8: మొర్రి పండ్ల కోసం వెళ్లిన యువకుడు విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని బోగుడ భూపతిపూర్ శివారులో సోమవారం చోటు చేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. భూర్గుపల్లి గ్రామానికి చెందిన బాజ కిశోర్(20) తండ్రి చేసే పాత ఇనుప సామాను వ్యాపారానికి సహాయకారిగా ఉండేవాడు. సోమవారం బోగుడ భూపతిపూర్ గ్రామ శివారులో మొర్రి పండ్లు తెంపేందుకు చెట్టు ఎక్కాడు. పండ్లు తెంపుతుండగా పైన ఉన్న విద్యుత్ వైర్లు తగలడంతో షాక్‌కు గురై కిందపడ్డాడు. చికిత్స నిమిత్తం మెదక్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని తండ్రి రవీందర్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆనంద్‌గౌడ్ తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి..



కృష్ణ మృతదేహం

పాపన్నపేట, ఏప్రిల్ 8: ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన పాపన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్తపల్లి లక్ష్మీనగర్ మధ్య మెదక్ బొడ్మట్‌పల్లి సోమవారం రాత్రి చోటుచేసుకున్నది. స్థానికుల వివరాల మేరకు అబ్లాపూర్ గ్రామానికి చెందిన ముమ్మని కృష్ణ(34) మెదక్ నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా ఘటన చోటు చేసుకున్నది. తలకు తీవ్రగాయాలు కావడంతో అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించే క్రమంలో మృతిచెందాడు. మృతుడికి భార్య మానసతో పాటు ఐదేళ్లలోపు ఓ కూతురు, కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గీతం విద్యార్థి..



అరుణ్‌కుమార్ (ఫైల్)

పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 8: ఓ పరిశ్రమకు చెందిన బస్సు ఢీకొనడంతో గీతం విద్యార్థి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కామారెడ్డికి చెందిన ఆకుల అరుణ్‌కుమార్(23) రుద్రారం గీతం యూనివర్సిటీలో ఎంబీఏ రెండో సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం హాస్టల్ నుంచి ఇస్నాపూర్‌లోని స్నేహితుని రూముకు బైకుపై వెళ్తున్నాడు. ఇస్నాపూర్ శివారులో గల గురుకుల పాఠశాల నుంచి ఇస్నాపూర్ గ్రామం వెళ్లేదారిలో అరుణ్‌కుమార్ రోడ్డు పైకి వస్తున్న సమయంలో ఓ పరిశ్రమకు చెందిన బస్సు ఢీకొనడంతో పాటు అరుణ్ ముందు టైరు వెనకాల పడడంతో తల పగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఆకుల ఆంజనేయులు ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఆసిఫ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైతుల పట్ల బీఆర్ఎస్ నాయకుల మొసలి కన్నీరు

- డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్

నర్సాపూర్, ఏప్రిల్ 8: బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజలలో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక రైతులను తప్పుదోవ పట్టించేందుకు మొసలి కన్నీరు కారుస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ విమర్శించారు. నర్సాపూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పాలన పట్ల ప్రజల నుంచి సానుకూల స్పందన వస్తున్నదన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావుకు అధికారంలో ఉన్నప్పుడు ఏనాడూ ప్రజలు గుర్తుకు రాలేదన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన అంతా అవినీతి అక్రమాలే అని, అందుకు ఒక్కొక్కటి బయటపడుతున్న అంశాలే నిదర్శనమన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు డీ.అంజిగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయ్, నాయకులు సురేష్‌నాయక్, రామాగౌడ్, నర్సింహులు, విజయ్, నగేష్, మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఏ గ్రామానికి వెళ్లినా బీజేపీకి ఆదరణ వస్తుంది

- ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నరమేష్‌గౌడ్

నర్సాపూర్/నిజాంపేట, ఏప్రిల్ 8: ఏ గ్రామానికి వెళ్లినా ప్రజల నుంచి బీజేపీ పట్ల ఆదరణ వస్తున్నదని, ఈ పార్లమెంట్ ఎన్నికల్లో రఘునందన్‌రావు గెలవడం ఖాయమని ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నరమేష్‌గౌడ్, జిల్లా నాయకుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం మండలంలోని చిన్నచింతకుంటలో ఇంటింటికి ప్రచారం నిర్వహించి మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. నిజాంపేట మండల పరిధిలోని బచ్చురాజ్‌పల్లి గ్రామంలో బీజేపీ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేష్, మహంకాళి పాల్గొన్నారు.

సామాజిక ఉద్యమాలను బలపర్చండి: సీఐటీయూ

జహీరాబాద్, ఏప్రిల్ 8: సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టే సామాజిక ఉద్యమాలను అందరూ బలపర్చాలని సీఐటీయూ జిల్లా నాయకుడు మైపాల్ పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఏప్రిల్‌లో నిర్వహించే మహనీయుల వర్ధంతి, జయంతిల సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలో సామాజిక సంఘీభావ నిధిని ఆయా పరిశ్రమల్లో సేకరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాజిరెడ్డి, సందీప్‌రెడ్డి, గణేష్, బాబు, బాల్‌రాజ్, మసి, నరేష్ పాల్గొన్నారు.

ముందస్తు ఆస్తిపన్ను చెల్లిస్తే ఐదుశాతం తగ్గింపు

సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 8: జిల్లాలోని మున్సిపాలిటీల పరిధిలో ముందస్తుగా ఆస్తిపన్ను చెల్లించే వారికి 5 శాతం తగ్గింపును ఇస్తున్నదని అధికారులు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్నును ఈనెల 30 లోగా చెల్లిస్తే 5 శాతం రిబేట్ ఇవ్వాలని నిర్ణయించారు. పురపాలక శాఖ ఆదేశాల మేరకు ఆస్తిపన్ను ముందస్తు చెల్లింపుపై జిల్లాలోని సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్, అమీన్‌పూర్, తెల్లాపూర్, బొల్లారం, అందోల్-జోగిపేట, నారాయణఖేడ్ పట్టణాల్లో మున్సిపల్ అధికారులు సోమవారం నుంచి ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు.

సంగారెడ్డి మున్సిపాలిటీ కార్యాలయంలో కంట్రోల్ రూమ్

సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 8: జిల్లా కేంద్రంలోని సంగారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత వేసవిలో నీటి సరఫరాల్లో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే 9652284404 నంబర్‌కు తెలియజేయాలని సూచించారు. రాష్ట్ర పురపాలిక శాఖ ఉత్తర్వుల మేరకు మున్సిపల్ కార్యాలయంలో ప్రజల సౌకర్యార్థం కంట్రోల్ రూమ్‌తో పాటు, మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

'ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెప్పాలి'

నర్సాపూర్, ఏప్రిల్ 8: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు మతోన్మాద శక్తులకు ఓట్లు వేయకుండా లౌకిక, ప్రజాస్వామ్య శక్తులకు ఓటు వేసి గెలిపించాలని సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు ఎ.మల్లేశం, టీఎం కాలేక్ పేర్కొన్నారు. సోమవారం నర్సాపూర్ సీపీఐ కార్యాలయంలో సీపీఎం, సీపీఐ పార్టీల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ సంపద పూర్తిగా కార్పొరేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నదని విమర్శించారు. ఈ సమావేశంలో సీపీఎం, సీపీఐ నాయకులు నాగరాజు, రాజాగౌడ్ పాల్గొన్నారు.

ఎన్నికల ఇన్‌చార్జిగా ఎంఏ.హకీమ్

హత్నూర, ఏప్రిల్ 8: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ మైనారిటీ విభాగం ఎన్నికల ఇన్‌చార్జిగా టీపీసీసీ మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎంఏ. హకీమ్‌ను నియమిస్తూ ఏఐసీసీ మైనారిటీ విభాగం నాయకత్వం ఉత్తర్వులు జారీచేసింది. హకీమ్ మాట్లాడుతూనర్సాపూర్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జిగా నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

సమాచారం

అక్రమ మద్యం పట్టివేత

వెల్దుర్తి, ఏప్రిల్ 8: మండల పరిధిలోని కుకునూర్ గ్రామంలో అక్రమంగా అమ్ముతున్న మద్యం బాటిళ్లు సీజ్ చేశామని ఎస్ఐ నవత సోమవారం తెలిపారు. వాటి విలువ రూ.3036 ఉంటుందన్నారు. బాటిళ్లను సీజ్ చేసి సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

గ్రామాల్లో ఏపీజీవీబీ సేవలు

నిజాంపేట, ఏప్రిల్ 8: గ్రామాల్లోనే బ్యాంకు సేవలతో పాటు అటల్ పెన్షన్ యోజన, ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, వ్యక్తిగత ప్రమాదాల బీమా, ఆరోగ్య బీమా లాంటి సేవలు బ్యాంకు మిత్రలో అందిస్తామని ఏపీజీవీబీ బ్రాంచ్ మేనేజర్ మురళీకృష్ణ అన్నారు. మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో సోమవారం మైక్రో ఏటీఎం ద్వారా బ్యాంకు పాస్‌బుక్ ప్రింటింగ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీజీవీబీ బ్యాంకు మిత్ర అవధూత మురళి, ఐరిక్స్ ఛానల్ మేనేజర్ వెంకటేష్ బ్యాంకు మిత్ర కేసరి రవి, నిజాంపేట బ్యాంక్ మిత్ర బృందం, ప్రజలు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

వెల్దుర్తి: మండల పరిధిలోని మెల్లూరు హల్దీవాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేశామని ఎస్ఐ నవత తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చెరువులు, బావుల దగ్గరికి విద్యార్థులు వెళ్లొద్దు

కల్హేర్/సిర్గాపూర్: వేసవి సెలవుల్లో విద్యార్థులు తమ గ్రామాల్లోని చెరువులు, కుంటలు, బావుల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని కల్హేర్, సిర్గాపూర్ ఎస్ఐలు వెంకటేశం, మహిపాల్‌రెడ్డి సోమవారం సూచించారు. వేసవి సెలవుల్లో దూర ప్రాంతాల్లో విద్యనభ్యసించే విద్యార్థులు సొంత గ్రామాలకు చేరుకుంటున్నారని అన్నారు. అలాంటి వారు ఎట్టి పరిస్థితుల్లో చెరువులు, బావుల వద్దకు వెళ్లద్దన్నారు. ఈ మేరకు కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లోని నీటి వనరుల వద్ద హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేశారు.

సమన్వయంతో పనిచేద్దాం: ఎమ్మెల్యే మాణిక్‌రావు



సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

జహీరాబాద్, ఏప్రిల్ 8: నియోజకవర్గవ్యాప్తంగా బీఆర్ఎస్ కుటుంబసభ్యులందరు సమన్వయంతో పనిచేసి జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న గాలి అనిల్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని అథితి-ఇన్‌లో జహీరాబాద్ మండల కార్యకర్తలతో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ ఎంతగానో అభివృద్ధి చెందిందని ఆయన గుర్తుచేశారు. 120 రోజుల కాంగ్రెస్ పాలనలో ఏమేరకు అభివృద్ధి జరిగిందనే విషయమై గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు బహిరంగ చర్చలు పెట్టి ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దేవిప్రసాద్, నరోత్తం, డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ మఛ్చందర్, మండలపార్టీ అధ్యక్షుడు తట్టు నారాయణ, నాయకులు పాల్గొన్నారు.

సోదరభావానికి ప్రతీక ఇఫ్తార్ విందులు: చంద్రశేఖర్



పట్టణంలోని భరత్‌నగర్‌లో నిర్వహించిన ఇఫ్తార్ విందులో మాజీమంత్రి చంద్రశేఖర్

జహీరాబాద్/జిన్నారం, ఏప్రిల్ 8: సోదరభావానికి ఇఫ్తార్ విందులు ప్రతీకగా నిలుస్తున్నాయని మాజీ మంత్రి డా.చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి పట్టణంలోని భరత్‌నగర్ తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొని మాట్లాడారు. రంజాన్ మాసం అత్యంత పవిత్రమైనదన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాలకు చెందిన నాయకులు ముల్తానీపాటిల్, రాంలింగారెడ్డి, ఖదీర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు. ముస్లింల సంక్షేమం, అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జిన్నారం మండలం కాజీపల్లిలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో శ్రీనివాస్ గౌడ్, బొల్లారం మున్సిపల్ వైస్ చైర్మన్ అనిల్‌కుమార్ రెడ్డి, కౌన్సిలర్ చంద్రారెడ్డి, ఎంపీపీ రవీందర్‌గౌడ్, ఎంపీటీసీ జానాబాయి, నాయకులు పాల్గొన్నారు.

అడుగంటిన భూగర్భ జలాలు.. ఎండుతున్న పంటలు

- ఆందోళనలో రైతన్నలు



రంగంపేట శివారులో నీరందక ఎండిపోతున్న వరి

కొల్చారం, ఏప్రిల్ 8: కొల్చారం మండలంలో బోరుబావుల కింద సాగుచేసిన వరి పంటలు నీరందక ఎండిపోతున్నాయి. మండలంలో ఘన్‌పూర్ ప్రాజెక్టుతో పాటు హల్దీవాగు ఉన్నా.. బోరుబావుల కింద యాసంగి సీజన్‌లో వరి సాగుచేశారు. కొల్చారం, రంగంపేట, వరిగుంతం, ఎనగండ్ల, అంసాన్‌పల్లి, వసురాంతండా, సీతారాంతండాలో వ్యవసాయానికి బోరుబావులే దిక్కు. గతంలో ఎన్నడూ లేనంతగా ఈయేడు భూగర్భ జలాలు అడుగంటడంతో వరి పొట్టకు చేరుకునే దశలో బోర్లు నీరు పోయడం లేదు. పంటను దక్కించుకునే ప్రయత్నంలో రైతులు వేల రూపాయలు ఖర్చు చేసి బోర్లను వేయిస్తూ.. అప్పుల్లో కూరుకుపోతున్నారు.

వరి ఎండిపోతుంది: ముల్లెల గణేష్, రైతు

ఆరెకరాల్లో వరిచేను వేశాను. ఈసారి భూగర్భజలాలు తక్కువై ఉన్న బోర్లు నీళ్లు పోయడం లేదు. పంటను కాపాడుకునేందుకు 600 ఫీట్ల లోతు రెండు బోర్లు వేశాను. చుక్కనీరు రాలేదు. దీంతో ఆరు ఎకరాల పంట ఎండుతున్నది. ప్రభుత్వం ఆదుకోవాలి.

కాంగ్రెస్ కోవర్టులను సస్పెండ్ చేయండి: బీఆర్ఎస్

జోగిపేట, ఏప్రిల్ 8: గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌లో ఉంటూ.. కాంగ్రెస్‌కు కోవర్టుగా పనిచేసిన పెద్ద నాయకుడిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని అందోలు-జోగిపేట మున్సిపాలిటీకి చెందిన నాయకులు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అందోలు ఇన్‌చార్జి చంటి క్రాంతికిరణ్‌కు వినతిపత్రం సమర్పించారు. అందోలు పట్టణానికి చెందిన ఒక నాయకుడు గత అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్ఎస్‌లో చేరి రాష్ట్రస్థాయి పదవి పొందారన్నారు. బీఆర్ఎస్‌లోనే ఉంటూ కాంగ్రెస్ అభ్యర్థికి కోవర్టుగా పనిచేశాడని ఆరోపించారు. ఫిర్యాదుచేసిన వారిలో బీఆర్ఎస్‌కు చెందిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ డీబీ నాగభూషణం, నాయకులు నాగరత్నంగౌడ్, కార్యకర్తలు ఉన్నారు.

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



ఉత్సవాలకు ముస్తాబైన వేంకటేశ్వరస్వామి ఆలయం

హవేళిఘణపూర్, ఏప్రిల్ 8: మండలంలోని కూచన్‌పల్లిలో కోరిన కోర్కెలు తీర్చే వెంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ఐదురోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన పూజారి నవీన్ పంతులు సోమవారం తెలిపారు. ఉత్సవాలకు మెదక్, కామారెడ్డి తదితర జిల్లాల భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారని పేర్కొన్నారు. మంగళవారం స్వామివారికి భ్రమణ శకటం, బుధవారం కుంకుమార్చనలు, గురువారం బేతాళస్వామికి భ్రమణ శకటం, శుక్రవారం బేతాళస్వామికి బండిశిల, శనివారం స్వామివారికి కల్యాణోత్సవం, రాత్రి రథోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని చెప్పారు.

గుండు శివకుమార్‌కు ఉత్తమ లీఫ్ అవార్డు



శివకుమార్‌కు ధ్రువపత్రం అందజేస్తున్న మాజీ స్పీకర్ మధుసూదనాచారి

నారాయణఖేడ్, ఏప్రిల్ 8: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన ప్రముఖ లీఫ్ ఆర్టిస్టు గుండు శివకుమార్ వివిధ సందర్భాలను పురస్కరించుకొని రావి, మర్రి, అరటి, తదితర ఆకులపై ఇప్పటివరకు 1,005 రకాల చిత్రాలను మలిచినందుకుగానూ హైరేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ వారు గుర్తించి ఉత్తమ లీఫ్ అవార్డుకు ఎంపిక చేశారు. సృజన ఆర్ట్స్ క్రియేషన్ వారు సోమవారం హైదరాబాద్ నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శివకుమార్‌కు తెలంగాణ ప్రథమ స్పీకర్ మధుసూదనాచారి బంగారు పతకం, ధ్రువపత్రం, బ్యాడ్జీని అందజేశారు. ఈ కార్యక్రమంలో హైరేంజ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ డైరెక్టర్ సుమన్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

చేగుంట పాఠశాలలో ముందస్తు ఉగాది

చేగుంట, ఏప్రిల్ 8: చేగుంట మండలంలోని శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో ఉగాది పర్వదినాన్ని విద్యార్థులు ముందస్తుగా జరుపుకున్నారు. విద్యార్థులు పచ్చడి తయారుచేసి, పంచాంగ శ్రవణం గావించారు. ప్రిన్సిపల్ వివేక్ మాట్లాడుతూ తెలుగు నూతన సంవత్సరం మొదటిరోజైన ఉగాదిని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలన్నారు.

బ్రాహ్మణ సంఘం ఉన్నంతకాలం సనాతన ధర్మం నిలుస్తుంది



బ్రాహ్మణ సేవాసంస్థ ఆధ్వర్యంలో 2024-25 సంవత్సరానికి సంబంధించి పంచాంగాన్ని విడుదల చేస్తున్న దృశ్యం

జహీరాబాద్/పెద్దశంకరంపేట, ఏప్రిల్ 8: సమాజంలో బ్రాహ్మణ సంఘం ఉన్నంతకాలం సనాతన ధర్మం నిలుస్తున్నదని బ్రాహ్మణ సేవా సంస్థ నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు పునీత్‌దీక్షిత్, నియోజకవర్గం అధ్యక్షుడు రాజ్‌కుమార్ దేశ్‌పాండే పేర్కొన్నారు. సోమవారం జహీరాబాద్ పట్టణంలోని హౌజింగ్‌బోర్డులో 2024-25 సంవత్సరానికి సంబంధించి పంచాంగాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవాసంస్థ నాయకులు బాలచందర్ జ్యోషి, కృష్ణారావు, కులకర్ణి, శ్రీహరిజ్యోషి, వసంతాకులకర్ణి, నర్మదాదేశ్‌పాండే, మంజులకులకర్ణి, కవిత, భవాని, అఖిల పాల్గొన్నారు.

నేడు పంచాంగ శ్రవణం

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పద్మశాలిభవన్‌లో క్రోధి నామ సంవత్సర పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పద్మశాలి సంఘం అధ్యక్షుడు గడ్డం జనార్ధన్ పేర్కొన్నారు. ఉగాది సందర్భంగా బ్రాహ్మణ సమాజం సేవా సంస్థ ఆధ్వర్యంలో పెద్దశంకరంపేటలో నూతన పంచాంగాన్ని నారాయణఖేడ్ నియోజకవర్గ అధ్యక్షుడు కిషన్‌రావుదేశ్‌పాండే, మండలాధ్యక్షుడు రామచంద్రచారి, బ్రాహ్మణ సంఘం మండలాధ్యక్షుడు కృష్ణశర్మ, అర్చక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడి చంద్రశేఖర్‌శర్మ ఆవిష్కరించారు.

రోడ్డుపై ధాన్యం ఆరబోస్తే చర్యలు: ఎస్ఐ

వెల్దుర్తి, ఏప్రిల్ 8: రైతులు ధాన్యాన్ని రోడ్లపై ఆరబోస్తే చర్యలు తప్పవని ఎస్ఐ నవత హెచ్చరించారు. రెండురోజుల క్రితం కుకునూర్ గ్రామం వద్ద మానేపల్లికి చెందిన దుబాషి రఘుపతి వరి కుప్పను ఢీకొని అక్కడిక్కడే మృతి చెందాడని, అదేరోజు మరికొంత మందికి గాయాలయ్యాయని చెప్పారు. కావున రైతులు ఖాళీ స్థలాల్లో ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలని చెప్పారు.

కాంగ్రెస్ తెచ్చిన కరువుతో పంటలు ఎండుతున్నాయి



మల్కాపూర్‌లో ఎండిన వరి పంటను పరిశీలిస్తున్న ప్రతాప్‌రెడ్డి

తూప్రాన్, ఏప్రిల్ 8: కాంగ్రెస్ తెచ్చిన కరువుతో పంటలు ఎండుతున్నాయని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం తూప్రాన్ మండలం మల్కాపూర్ శివారులో రైతు పెద్దకారి దేవయ్యకు చెందిన ఎండిన వరి పంటను పరిశీలించారు. కాలువల్లో నీరు వదలకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని వివరించారు. దేవయ్య వేసిన ఐదు ఎకరాలు నీళ్లు లేక ఎండిపోయిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్క గుంట భూమిలో పంట ఎండిపోలేదన్నారు. ఎండుతున్న పంటలకు ఎకరాకు రూ.30 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణగౌడ్ పాల్గొన్నారు.

కనులపండువగా నరేంద్రచార్య మహరాజ్ పాదుక పూజ

కంగ్టి, ఏప్రిల్ 8: జగద్గురు రామానందచార్య దక్షిణపీఠం నానిజ్ ధామ్‌కు చెందిన స్వామి నరేంద్రాచార్య మహరాజ్ పాదుకల పూజ సోమవారం మండల కేంద్రమైన కంగ్టిలో కనుల పండువగా జరిగింది. నూకల ప్రవీణ్ నివాసం నుంచి స్వామివారి పాదుకలను ప్రత్యేక రథంలో ఊరేగింపుగా బసవ ప్రదీప్ కల్యాణ మండపం వరకు తీసుకెళ్లి పూజలు చేశారు. అనంతరం బలహీనవర్గాల పునరావాస కార్యక్రమం ద్వారా సన్నచిన్న కారు రైతులకు ఎస్ఐ విశ్వజన్ చేతులమీదుగా ఉచితంగా స్పేయర్‌లు పంపిణీ చేశారు.